అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాల అమలుకై ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని జన్మభూమి కాలనీలో జరుగుతున్న సర్వేను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే కోసం వచ్చిన అధికార బృందానికి ప్రజలు వాస్తవ వివరాలను అందజేయాలన్నారు. తొలిదశలో సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరులో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించటం కోసం పరిశీలన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, శ్రావణి, రవికుమార్, ముస్తఫా, నాయకులు పాండుగౌడ్, జిల్లా గణేష్, కాశీనాథ్ యాదవ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో ఫ్యాకల్టీ నియామక ఇంటర్వ్యూలు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అఫిలియేటెడ్ ప్రైవేట్ కాలేజీల అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ నియామక ఇంటర్వ్యూలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జేఎన్‌టీయూ నూతన అడ్మిషన్ బ్లాక్‌లో ఈ నెల 20 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, రెక్టార్ ప్రొఫెసర్ కె. విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

రోడ్లపైనే కుప్పలుగా చెత్త



హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ పార్కు వద్ద రోడ్డుపై వేసిన చెత్త

శేరిలింగంపల్లి: భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తను రోడ్లపైనే వేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ విభాగం వాటిని తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తోందని విమర్శలు వస్తున్నాయి. శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని పార్కు(కూరగాయల మార్కెట్ వద్ద) ముందు భాగంలో నిత్యం చెత్త, దుర్వాసనతో పాటు పార్కులోకి కాలనీవాసులు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు పార్కు ముందు భాగంలో చెత్త వేయకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గుమ్మడిదలను సందర్శించిన ఆర్డీఓ

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రాన్ని ఆర్డీఓ రవీందర్‌రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా, ఆహార భద్రత కార్డుల ఎంపిక ప్రక్రియపై అధికారులతో చర్చించారు. ఈ ప్రక్రియను సజావుగా చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ గంగాభవానీ, ఆర్‌ఐ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు యోగాలో ఉచిత శిక్షణ

మణికొండ: ఆరోగ్య పరిరక్షణకు అన్ని వయసుల వారు యోగాను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు శ్రీగురు యోగాలయం తరఫున శనివారం ఉచిత శిక్షణను ఇస్తున్నామని సంస్థ నిర్వాహకుడు అమృతరావు తెలిపారు. శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఔత్సాహికులు కార్యక్రమంలో పాల్గొని యోగాను నేర్చుకోవాలని ఆయన కోరారు.

నేడు నార్సింగిలో ఎమ్మెల్యే పర్యటన

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, నార్సింగి వార్డులలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పర్యటించనున్నారు. రూ. 8.25 కోట్లతో చేపట్టిన కమ్యూనిటీ హాల్‌లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కోకాపేట నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి 20 వరకు నాల్గవ ఇంటర్ కాలేజీ స్పోర్ట్స్, గేమ్స్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ ప్రశాంత్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలలో రాజేంద్రనగర్, ములుగు, పాలెం నుంచి సుమారు 250 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.



నల్లగండ్ల కూరగాయల మార్కెట్

పూర్వ వైభవం ఎప్పుడో..?

నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌కు దశాబ్దాల చరిత్ర

- 12 షెడ్లు, 109 షాపులతో నిత్యం బిజీగా..
- ఏళ్లు గడుస్తున్నా వెంటాడుతున్న సమస్యలు
- వినియోగదారులు, రైతులకు తప్పని తిప్పలు
- మేయర్, ఎమ్మెల్యే పర్యటనతో చిగురిస్తున్న ఆశలు

శేరిలింగంపల్లి: దాదాపు రెండు దశాబ్దాలు గడుస్తున్నా హైటెక్ ప్రాంతంగా పేరుగాంచిన శేరిలింగంపల్లిలో రైతుబజార్ లేదు. నల్లగండ్లలోని కూరగాయల మార్కెట్‌నే ఇక్కడి వారు మినీ రైతు బజార్‌గా పిలుస్తారు. నిత్యం పెద్దసంఖ్యలో వినియోగదారులు వస్తుంటారు. నిత్యం తెల్లవారుజాము 4.30 గంటల నుంచే మార్కెట్ కళకళలాడుతుంది. కానీ ఇప్పటికీ ఎన్నో సమస్యలు కూరగాయలు విక్రయించే రైతులతో పాటు వినియోగదారులను వెంటాడుతున్నాయి. ఈ నెల మొదటి వారంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, జీహెచ్‌ఎంసీ స్థానిక, ఉన్నతాధికారులతో కలిసి పర్యటించి మార్కెట్‌ను సందర్శించిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా మార్కెట్‌లో మౌలిక వసతులు కల్పిస్తారనే ఆశలు చిగురిస్తున్నాయి.

190 షాపుల్లో విక్రయాలు..

- నల్లగండ్ల మార్కెట్‌కు రెండు దశాబ్దాల చరిత్ర.
- మార్కెట్‌లో 12 షెడ్లు ఉండగావాటిలో 190 షాపులు కొనసాగుతున్నాయి.
- చందానగర్, తారానగర్, నల్లగండ్ల, భెల్, లింగంపల్లి పరిసరాల వారే కాకుండా చుట్టూ ఉండే ప్రాంతాల్లోని వినియోగదారులు వస్తుంటారు.
- పలు గ్రామాల రైతులు నేరుగా వచ్చి పండ్లను మార్కెట్ చుట్టూ ఉండే ఖాళీ స్థలాలు, రోడ్లకు ఇరువైపులా విక్రయిస్తున్నారు.
- అందరికీ అందుబాటులో ఉండేవిధంగా ప్రధాన గేటు పక్కనే రూ.5లకే భోజన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



వరదల కారణంగా నాలా వైపు కూలిపోయిన మార్కెట్ ప్రహరీ గోడ

కనీస సౌకర్యాలు కరువు..

- నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో మౌలిక వసతులు కరువయ్యాయి.
- మార్కెట్ నిర్మాణ సమయంలో షెడ్లపై సిమెంట్ రేకులు వేయడం వలన అవి ఇప్పటికే చాలా చోట్ల విరిగిపోయాయి. దీంతో వర్షాకాలంలో కూరగాయల వ్యాపారులు తడుస్తూనే ఉండాల్సిన పరిస్థితి ఉంది.
- మార్కెట్ ప్రహరీ ఎత్తు పెంచడంతో పాటు మరమ్మతులు అవసరం.
- నాలా వైపు కూలిన ప్రహరీ నిర్మించి, పూర్తిగా మెష్ ఏర్పాటు చేయాలి.
- ప్రభుత్వం ద్వారా కౌంటర్ ఏర్పాటు చేసి బియ్యం, పప్పులు, నూనెలు వంటివి సబ్సిడీ ధరలపై విక్రయించేలా ఏర్పాటు చేయాలి.
- మార్కెట్‌లోని కూరగాయల విక్రయదారులు, కూరగాయల రైతులతో సమావేశం ఏర్పాటు చేసి కావాల్సిన సౌకర్యాలపై చర్చించి వాటిని పరిష్కరించేలా చేయాలి.



నల్లగండ్ల మార్కెట్‌లోని షెడ్లు

జేపీనగర్‌లో వాహనాల తనిఖీలు





మియాపూర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జేపీనగర్, హాఫీజ్‌పేట్, మంజీరా రోడ్డు, జాతీయ రహదారి, పలు ప్రాంతాల్లో ఇన్‌స్పెక్టర్ కె.క్రాంతి కుమార్ పర్యవేక్షణలో శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరైనా పత్రాలు లేని వారి వివరాలను నమోదు చేసుకుని జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, హెల్మెట్ ధరించాలని తెలిపారు. లేదంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణాలు సాగించాలని పేర్కొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ హరి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఫోన్‌లో ప్రయాణికులు తమ సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. సలహాలు కూడా స్వీకరిస్తామన్నారు. 9959226151 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు



చందానగర్: చందానగర్, వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీరాంనగర్, అపర్ణ ఎన్‌క్లేవ్, కిన్నెర హోటల్ గంగారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు శిల్పా ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, అర్జున్‌రెడ్డి కాలనీ ఏరియాలో సరఫరా ఉండదు.
- శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గౌతమీనగర్, వార్డు ఆఫీస్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ ఏరియాల్లో సరఫరా ఉండదు.
- ఓల్డ్ ముంబై ఎక్స్‌రోడ్డు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓల్డ్ ముంబై రోడ్డు, వేముకుంట, రామ్‌రాజ్ కాటన్ షాపు వెనకాల వైపు, బీహెచ్‌ఈఎల్ మెయిన్ రోడ్డు, గౌతమీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు.

పాపిరెడ్డికాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో..

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిల్పాగార్డెన్స్, వెంకటేశ్వర లేఅవుట్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, నార్నె ఎస్టేట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి తెలిపారు.

దూబే కాలనీ ఫీడర్ పరిధిలో..

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా దూబే కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట నారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ దూబే కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 1 గంటల వరకు ఆదర్శనగర్, బాపూనగర్, దూబేకాలనీ. శాంటా మరియా ఇంటర్నేషనల్ స్కూల్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

పలు ఫీడర్ల పరిధిలో..

మియాపూర్: కేంద్రీయ విహార్, శ్రీలా గార్డెన్ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ రవిచంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కేంద్రీయ విహార్, రత్నదీప్ బ్యాక్ సైడ్, మయూరినగర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి 3:30 గంటల వరకు శ్రీలాగార్డెన్స్, నడిగడ్డ తాండ, దోవా కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్‌లో..

మదీనాగూడ, కృషినగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, ప్రశాంత్‌నగర్, వీడియా కాలనీ, మియాపూర్ మెయిన్ రోడ్డు, లేక్‌వ్యూ అపార్ట్‌మెంట్, సత్య కళ్యాణ్ అపార్ట్‌మెంట్స్, ఎస్‌ఎంఆర్ మెట్రో పాలిస్, ఎస్‌ఆర్‌ఎస్ ఎస్టేట్ అపార్ట్‌మెంట్స్, వడ్డెర బస్తీ, విజేత సూపర్‌మార్కెట్ రోడ్డు, టాకిటౌన్ మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న చంద్రిక ప్రసాద్‌గౌడ్

మియాపూర్: శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా మియాపూర్ మయూరినగర్‌కు చెందిన చంద్రికప్రసాద్‌గౌడ్ నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతారావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు సాయిజ్యోతి చేతులమీదుగా ఆమె నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు కాంగ్రెస్ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పార్టీ, మహిళా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీకి వినతి పత్రం అందజేస్తున్న కొత్తగూడ వాసులు

గచ్చిబౌలి: కొత్తగూడలోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన సీసీ రోడ్లు, నీటి వ్యవస్థ, వీధి దీపాలను మెరుగుపర్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఊట్ల దశరథ్, ప్రసాద్, కృష్ణ, శ్రీనివాస్, నరేష్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

శిల్పారామంలో ముగిసిన గాంధీ శిల్పబజార్



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్ శుక్రవారంతో ముగిసింది. పది రోజులుగా నిర్వహిస్తున్న మేళా సందర్శకులను ఆకట్టుకుంది. ముగింపులో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో నేహాసింగ్ శిష్య బృందం జానపద నృత్యాలతో సందర్శకులను అలరించారు. కోలాటం, బిహు, లంబాడి, ఓయిలాట్టం, ఉత్తరాఖండ్ జానపద నృత్యం, సంబల్పూరి, భాంగ్రా, కావడి చిందు, అంశాలను అనన్య, గణశ్రీ, జోషిత, వాణి, శ్రీలత, మౌనిక, అనిత, నైనా తదితరులు పాల్గొని ప్రదర్శించారు.



మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్
- మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి



మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులను అధికారులు, స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న జగదీశ్వర్‌గౌడ్

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ ఫ్లైఓవర్ నుంచి హుడాకాలనీ వరకు చేపట్టిన మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులను త్వరతగతిన పూర్తిచేయాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. మంజీరా పైప్‌లైన్ రోడ్డు పనులను స్థానికులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. నూతన రోడ్డు పనులతో మంజీరా పైప్‌లైన్ రోడ్డులో నివసించే వివిధ కాలనీల ప్రజలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. అభివృద్ధికి బాటలు వేస్తూ మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు పూర్తి చేయాలన్నారు. జీహెచ్‌ఎంసీ డీఈ, ఏఈలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల సంజీవరెడ్డి, వీరేందర్ గౌడ్, కృష్ణ, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేములకు నివాళి

రాయదుర్గం: హెచ్‌సీయూ మాజీ విద్యార్థి రోహిత్ వేములకు అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నివాళులర్పించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో రోహిత్ వేముల స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రోహిత్ వేముల స్థూపానికి పూలమాలలు సమర్పించిన తల్లి రాధికావేముల, పలువురు అతిథులు, విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద ఉన్న గుర్రం జాషువా ఆంపీ థియేటర్‌లో రోహిత్ వేముల స్మారక సమావేశాన్ని ఏఎస్‌ఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, రోహిత్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని, అడ్మిషన్లు, నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, కేజీ నుంచి పీజీ వరకు అందరికీ వివక్షత లేని ఉచిత నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేములకు న్యాయం చేయాలని 'రోహిత్ అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ఫ్యాకల్టీ డాక్టర్ లక్ష్మణ్ యాదవ్, హైకోర్టు అడ్వకేట్ వి.రఘునాథ్, రోహిత్ వేముల తల్లి రాధికా వేముల, జైభీమ్‌రావు, అనుపమ, ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, చంద్రం పంచమి, ఏఎస్‌ఏ అధ్యక్షురాలు వెన్నెల, నాయకులు ప్రశాంత్ దొంత, ఆకాశ్ విద్యార్థులు పాల్గొన్నారు.



రోహిత్ వేముల స్మారక దినోత్సవ సమావేశంలో అతిథులు, విద్యార్థులు

ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ నూతన కార్యవర్గం

రాయదుర్గం: హెచ్‌సీయూలో అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నూతన కార్యవర్గాన్ని ఏబీవీపీ సెంట్రల్ యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ బాలకృష్ణ శుక్రవారం ప్రకటించారు. ఇప్పటికే హెచ్‌సీయూ ఏబీవీపీ నూతన అధ్యక్షుడిగా అనీల్‌కుమార్, కార్యదర్శిగా అయూష్‌కుమార్‌సింగ్ నియామకం అయినట్లు ఆయన గుర్తు చేశారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా సాక్షి, యశస్వి, జైస్వాల్, శివను నియమించినట్లు తెలిపారు. సంయుక్త కార్యదర్శులుగా సత్యంశుక్ల, ప్రభాస్, వైష్ణవి, మానస్, కార్యవర్గ సభ్యులుగా శుభం జైస్వాల్, ప్రాచి, జితేందర్, దేవదత్, సందీప్, అనురాగ్‌సింగ్, బిషాల్, మణికంఠకుమార్, రాహుల్, ఎస్‌హెచ్‌ఓడీహెచ్ కన్వీనర్లుగా శృతి, సత్యనారాయణ, కార్తికేయ, స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా అభిజిత్, సోషల్ మీడియా కన్వీనర్లుగా మహి, బిశ్వజిత్, స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా రితేష్, స్టూడెంట్స్ ఫర్ సేవా కన్వీనర్‌గా వినయ్‌త్రిపాఠి, రాష్ట్రీయ కళా మంచ్ కన్వీనర్‌గా శైలి, ఖేలో భారత్ కన్వీనర్‌గా సునీల్‌రెడ్డి, నార్త్ క్యాంపస్ ఇన్‌చార్జీగా పరమేశ్వర్, సౌత్ క్యాంపస్ ఇన్‌చార్జీగా నవీన్ మోహన్‌ను నియమించినట్లు ఆయన వివరించారు.

హెచ్‌సీయూ క్యాంపస్ ఆస్పత్రికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు

అందజేసిన స్వతంత్ర విద్యార్థి బృందం విద్యార్థులు



ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందిస్తున్న హెచ్‌సీయూ ఇండిపెండెంట్ స్టూడెంట్స్ గ్రూప్ విద్యార్థులు

రాయదుర్గం: దేశవ్యాప్తంగా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారుతున్న తరుణంలో హెచ్‌సీయూ క్యాంపస్‌లోని వైద్య కేంద్రానికి స్వతంత్ర విద్యార్థి బృందం విద్యార్థులు రెండు చిన్న ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను శుక్రవారం అందించారు. క్యాంపస్ వైద్య కేంద్రంలో చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ వినీత్ నాయర్, సీఎంఓ కెప్టెన్ రవీంద్రకుమార్, సీఎంఓ డాక్టర్ అనుపమకు ఈ రెండింటినీ విద్యార్థులు అందించారు. ఈ సందర్భంగా స్వతంత్ర విద్యార్థి బృందం ప్రతినిధి ఆకాష్‌బాటి మాట్లాడుతూ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా క్యాంపస్ వైద్య కేంద్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకొని వీటిని అందించినట్లు వివరించారు. మా బృందంలోని విద్యార్థులంతా కలిసి సొంతంగా నిధులను సమీకరించి వీటిని అందించినట్లు ఆయన స్పష్టం చేశారు. హెచ్‌ఎంపీవీ వైరస్ అంతగా లేదని, ముందు జాగ్రత్తల విషయంలో అవగాహన కల్పించడంలో కూడా ముందుంటామన్నారు. కార్యక్రమంలో వైద్య కేంద్రం డాక్టర్ సి.గంగాధర్, నర్సింగ్ విభాగం ప్రతినిధి కె.హిమబిందు, మల్లేశ్వరి, విద్యార్థులు కర్ణిసింగ్, కిరిస్టన్, రీతాంజలిపాత్ర, కైలాష్‌బిష్ణోయ్, సంగమేష్‌రెడ్డి, సచిన్, అంకిత్, హర్ష, ఆనంద్, కమల్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు

శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ వంటి పథకాల్లో భాగంగా అధికారులు ఇంటింటి పర్యటన చేసి అర్హుల గుర్తింపు ప్రారంభించారన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హుల ఎంపిక జరిగే విధంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకం చేరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. పేదల కలలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఈనెల 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు అందించే ప్రక్రియ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో 2.81 కోట్ల మందికి ఇప్పటికే 90 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. రేషన్ కార్డులు జారీ ప్రక్రియ ఇక నిరంతరం కొనసాగుతుందన్నారు.

21న వార్డు కార్యాలయాల్లో గ్రామ సభలు

- రేషన్ కార్డుల అర్హులైన తుది జాబితా విడుదల చేస్తాం
- చందానగర్ సర్కిల్ 21 ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్: నూతన రేషన్ కార్డుల పరిశీలన 20వ తేదీన ముగిసిన తర్వాత 21వ తేదీన చందానగర్ సర్కిల్–21 పరిధిలోని నాలుగు డివిజన్లలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఉపకమిషనర్ మోహన్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, మాదాపూర్ డివిజన్ల వార్డు కార్యాలయాల్లో ఈ నెల 21వ తేదీ మంగళవారం ఉదయం 10.30 గంటలకు రేషన్‌కార్డు తుది జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ గ్రామ సభలకు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీతో పాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు హాజరవుతారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డు అందిస్తామన్నారు. కులగణన సర్వే ఆధారంగా రేషన్ కార్డు దరఖాస్తుల పరిశీలన చేస్తున్నామని, దాని ఆధారంగానే గ్రామసభల్లో అర్హులైన వారి జాబితా వార్డు కార్యాలయాల్లో అందుబాటులో ఉంచుతామన్నారు.

మౌలిక వసతులకు పెద్దపీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

జిన్నారం(పటాన్‌చెరు): ప్రణాళికాబద్ధంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలం అండూర్, సోలక్‌పల్లి, రాళ్లకత్వ, ఊట్ల, కొర్లకుంట, జిన్నారం, జంగంపేట, వావిలాల, అలీనగర్ గ్రామాలలో రూ.3.90 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులకు కల్పనకు పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. అనంతరం స్థానిక నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుణరెడ్డి, తహసీల్దార్ భిక్షపతి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, నాయకులు గంగు రమేష్, వడ్డే కృష్ణ తదితరులు పాల్గొన్నారు.